7

# ఆత్మాభిమాని

"ఏమంటావ్?" అన్నట్టు చూశాడు రామచంద్రం. నేనేమీ అనలేదు. అనే స్థితిలో కూడా లేను. అసలే మనస్సంతా చిరాగ్గా ఉన్నది. దానికితోడు రామచంద్రం, వొకటే మోయ్యిన నసపెడుతున్నాడు. వాణ్ని 'కా'దనీ అనలేను. అలాగని 'సరే'ననీ అనలేను.

ఒకప్పుడైతే, ఆ కుర్రవెధవను నాతో తెచ్చుకొందుకు నాకేమీ అభ్యంతరం లేదు. నాకూ పిల్లలు పెరిగారు. వచ్చే పోయే జనం పెరిగింది. ఖర్చులు పెరిగాయి. ఈ కరువు రోజులలో, ఒక మనిషిని సాకడమంటే మాటలు కాదు. ఈ మాటే రామచంద్రంతో అన్నాను.

వాడో క్షణం నా ముఖంకేసి చూసి తలొంచుకొన్నాడు. బహుశా ఇలాంటి సమాధానం నానుంచి వస్తుందని, వాడూ ఊహించి ఉండడు.

"ఇన్నేళ్ళకుగాను, నేను నిన్నడుగుతున్న ఆబ్లిగేషన్ ఇదొక్కటే! మరోసారి నిన్నేదీ అడగను. ఏదోలా ఈ వొక్క పనీ చేసిపెట్టు" అన్నాడు వాడు బతిమిలాడుతున్న ధోరణిలో.

అసలు వాణ్ని గురించి నీ కింత మమకార మేమిట న్నాను. పేదతనమే కారణ మయితే, ఈ దేశంలో లక్షలాది పేదప్రజ లున్నారన్నాను. వాళ్ళందరినీ ఉద్ధరించడం నీ వల్లా, నావల్లా కాదన్నాను.

నేనన్న ప్రతిదానికీ వాడు వొప్పుకొంటూనే, అసలు విషయం చెప్పాడు.

"వాడు మంచివాడ్రా! అమాయకుడు. అబద్ధమాడ్డం ఎరగడు. కష్టపడి పని చేస్తాడు. నిన్నయినా వాణ్ని ఊరికే మేప మనడం లేదు. పదన్నా ఇంత చాకిరీ చేయించుకో. రెండు పూటలా ఇంత తిండి పెట్టు. ఈ బరువైనా జీవితాంతం మోయమని నే ననడంలేదు. నా పరిస్థితి రవంత మెరుగయిం దాకా చూడు. తరువాత, నేనే వాణ్ని తీసుకొచ్చుకొంటాను. ఇంకోరి దగ్గర వాణ్ని ఉంచలేక కాదు. మిగిలిన వాళ్ళు - వాణ్ని హీనంగా చూస్తారని నా భయం. నువ్వయితే మనిషిని మనిషిలాగా చూస్తావని నా నమ్మకం" అన్నాడు రామ చంద్రం.

వాడింతగా చెబుతుంటే కాదనలేక పోయాను. గానుగ లోదే గంటెడనుకొని, 'సరే' నన్నాను.

"ఇన్నిటికీ వాడి పేరేమిటో చెప్పావుకాదే" అన్నాను రామచంద్రంతో.

"నాకూ తెలీదు. వాణ్ని నేను సత్యమని పిలుస్తున్నా. ఇష్టమయితే, నువ్వూ అలానే పిలువ్. లేదా 'సత్తిగా' అను.

నువ్వెలా పిలిచినా వాడేమీ అనుకోడు.'' అన్నాడు రామచంద్రం.

నిజానికీ బరువు నెత్తికెత్తుకోడం నాకే మాత్రం ఇష్టం లేదు. చిరాకు పడుతూనే ఇంటికి తీసుకొచ్చాను. చిరాకుపడుతూనే మా ఆవిడకు చెప్పాను.

''పోనిద్దురూ పాపం! ఎవ్వరూ గడిచి బతకలేదు. ఏ రోజున ఎవరికేరాత రాసున్నదో ఎవరు చెబుతారు ? ఉండనీండి, చిన్నపనికీ, పొన్నపనికీ వాడే పనికొస్తాడు'' అన్నదావిడ.

రామచంద్రం చెప్పింది అక్షరాలా నిజమని, నాకు రెండో వారంలోనే తెలిసింది. సత్యం చాలా మంచివాడు. మా పిల్లలతో పోలిస్తే వాడు దేవుడల్లే నాకనిపించాడు. ఉదయమే లేచి పక్కలు తీసేవాడు. బాయిలర్ ముట్టించేవాడు. చిన్నవాళ్ళిద్దరకూ నీళ్ళు పోసేవాడు. బజారుకెళ్ళి కూరా, నారా తెచ్చేవాడు. పిల్లల్ని బడిదాకా పంపించి వచ్చేవాడు. నాకు మధ్యాహ్నం భోజనం పట్టుకొచ్చేవాడు. రెండు రోజులకోసారి బూట్లకు, చెప్పులకు పాలిష్ చేసేవాడు. మొక్కలకు నీళ్ళు పోసేవాడు. తమాషా ఏమంటే, వాడింత పని చేస్తున్నా విసుక్కునేవాడు కాదు. ఈ దిక్కుమాలిన చాకిరి మధ్య, వాడేదన్నా పుస్తకం పట్టుకొని, మెల్లిగా గొణుగుతుండేవాడు.

సత్యాన్ని చూస్తే, ఒక్కోసారి నాకు అపరిమితమైన జాలి కలిగేది. వాడి ఈడున్న పిల్లలు నాకూ ఉన్నారు. వా

ళ్ళందరూ, చక్కగా ముస్తాబయి, స్కూళ్ళకు పోతున్నప్పుడు సినిమాలకు, షికార్లకు పోతున్నప్పుడు, వాడి మనస్సు ఎంత క్షోభించి పోతుందో ననుకొనేవాణ్ణి. అయితే సత్యంలో అలాంటి లక్షణా లేమీ కనిపించేవి కావు. వాడివన్నీ పట్టించు కొంటున్నాడో లేదో కూడా నాకు తెలియదు.

నేను రెండుమూడుసార్లు ఆవిణ్ని చాటునా మాటునా అడిగిచూశాను.

"ఛఛ. అదేం లేదండీ! నిప్పులాంటి కుర్రాడు. వాణ్ని అనుకోవడం మనకే పాపం!" అన్నదావిడ.

రెండుమూడు మాసాలకల్లా సత్యం మా ఇంట్లో వొక డుగా తయారయ్యాడు. వాడికి పైపనులు కాస్త తగ్గించి, చదువుకొనే అవకాశం ఇవ్వడం మంచి దనిపించింది నాకు.

సరిగ్గా ఆ సమయంలోనే జరగకూడని పనొకటి జరిగి పోయింది. ఏవో సరుకులు తీసుకురమ్మని ఆవిడ డబ్బిచ్చి కొట్టుకు పంపించింది. తన లెఖ్ఖ ప్రకారం, రూపాయి, పది హేను పైసలు తిరిగొస్తాయని ఆవిడంటుంది. కానీ సత్యం— రెండు రూపాయలు తగ్గాయంటూ ఇంటి కొచ్చాడు. తను ఖచ్చితంగా, పదిహేను రెండురూపాయల నోట్లు ఇచ్చానంటుం దామె. తను లెక్కించలేదనీ, ఆ బొత్తిబొత్తి ఆపళంగానే వెంకటేశ్వర్రావు కిచ్చాననీ, సత్య మంటాడు. నే వెళ్ళి కను క్కొన్నాను. తనకు 14 రెండు రూపాయల నోట్లే ఇచ్చాడ న్నాడు వెంకటేశ్వర్రావు. అతనూ మంచివాడే? నాలుగేళ్ళ

నుండీ సరుకులు వాడుతున్నా, ఎప్పుడూ వొక్క పైసకూడా తప్పురాలేదు. అలాంటివాడు, ఈ ముష్టి రెండు రూపాయల కోసం అబద్ధమాడతాడా ?

"నువ్వెక్కడన్నా పారేశావా?" అనడిగాను సత్యాన్ని 'లే'దన్నాడు వాడు.

ఇచ్చిన డబ్బు ఇచ్చినట్టుగా, సంచిలో వేసుకొన్నా నన్నాడు. సంచీకి చిల్లి కూడా లేదన్నాడు.

"ఇదెట్టా జరిగిందో నాకూ తెలవడం లేదండీ! అమ్మ గారు తక్కువిచ్చేవారు గాదాయె. యంకటేశ్వర్రావుగారు శానా మంచోడు. అబద్ధం ఆడరు." అన్నాడు సత్యం.

"ఏదన్నా కావాలంటే నేనే ఇస్తానుగదా! ఇలాంటి పాడుపన్లు నువ్వెందుకు చేస్తావురా సత్యం....ఇంద ! ఈ రెండు పట్టుకెళ్ళు. సరుకులు తీసుకురా !" అన్నదావిడ. రెండురూపా యల చిల్లరా వాడి చేతిలో పోస్తూ.

సత్యం ఏమీ అనలేదు. వంచినతల ఎత్తకుండా వెళ్ళాడు.

అదే నేను వాణ్ని ఆఖరుసారి చూశటం! సరుకులు తెచ్చాట్ట, అన్నీ వివరంగా చెప్పాట్ట, మేం కుట్టించిన చొక్కాలు లాగులు విడిచిపెట్టాడట. తన గుడ్డలు తొడుక్కొని వెళ్ళి పోయాడు. ఒకవేళ రామచంద్రం దగ్గరకుగానీ వెళ్ళాడేమోనని జాబు రాశాను. 'రాలేదు' అంటూ ఒక్క ముక్కే రాశాడు రామచంద్రం.

"నేనైనా దురుద్దేశంతో వాణ్ననలేదండీ! చిన్న

వెధవ గనుక, ఏవంత జాగ్రత్తగా ఉంటాడని - ఆ మాటైనా అన్నాను గానీ - లేకపోతే, అనకపోదును.'' అన్నదావిడ పశ్చాత్తాపపడుతూ.

వారం రోజులపాటు వాడి స్మరణతోనే గడిచిపోయింది మాకు. ఎనిమిదో రోజున, మా చిన్నవాడు, ఓ కవరు తెచ్చి వాళ్ళమ్మ కిచ్చాట్ట. అందులో రెండు రూపాయలున్నాయట్ట. 'ఎక్కడివిరా' అంటే, సత్తె మొచ్చి ఇచ్చాడని చెప్పాడు గోపి. మా యింటికి రమ్మన్నాట్ట గోపి. సత్యం రానన్నాట్ట. గోపిని కావలించుకొని ముద్దుపెట్టుకొన్నాట్ట. వాడి జేబు నిండా పిప్పరమెంట్లు నింపాట్ట. అందరూ బావున్నారా - అని, పేరు పేరు వరసనా అడిగాడని చెప్పాడు గోపి!

సత్యం వెళ్ళిపోవడంతో, వాడు చేసే పని చాలాభాగం నా నెత్తిన పడింది.

''బియ్యం నిండుకున్నాయి. ఓసారి కొట్టుదాకా వెళ్ళి రండి!'' అన్నదావిడ.

నన్ను చూస్తూనే వెంకటేశ్వర్రావు నాలుక్కరుచుకొన్నాడు.

''అసలు నేనే వద్దామనుకొంటున్నాను. కొట్లోంచి లేవడానికే తీరిక లేకుండా ఉంది.... మీ కుర్రాడన్న మాటే నిజమండీ! ఆ రాత్రే లెక్క చూశాను. రెండు రూపాయలు ఎక్కువొచ్చాయి. వొద్దాం వొద్దామనుకొంటూనే తాత్సారం

చేశాను. రొఖ్ఖం పుచ్చుకొంటారా? సరుకులు పట్టుకెడతారా?" అన్నాడు వెంకటేశ్వర్రావ్.

నేనేమీ అనలేదు.

అయినా అనడాని కేముంది గనక?